క్లుప్తంగా

దీక్షాపరుల శిలువ యాత్ర

వైరా: వైరా శాంతినగర్‌లోని హోలీ ట్రినిటీ చర్చి ఫాదర్ జ్వాన్నేసు ఆధ్వర్యంలో మంగళవారం సుమారు 200 మంది దీక్షా పరులు పాప పరిహార శిలువ యాత్రను చేపట్టారు. ఇక్కడి చర్చి నుంచి రెబ్బవరం పాలడుగు, మధిర, ఎర్రుపాలెం మండలం బనిగెండ్ల పాడు, అయ్యవారి గూడెంలలో శిలువతో ప్రార్థనలు చేసుకుంటూ వెళ్లారు. ఈ దీక్ష యాత్రలో దీక్షాదారులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ డీనియా మాథ్యూ, ఉపదేశులు సత్యం, శాంతక్క, బాబూరావు, సురేష్ తదితరులు ఉన్నారు.

మద్యం మత్తులో వీరంగం

కారేపల్లి: మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌కు చెందిన సారంగ మంగళవారం అతిగా మద్యం సేవించగా.. ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ చేస్తున్న పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. అలాగే, పోలీసు వాహనాన్ని అడ్డుకుని పెట్రోల్ సీసాతో హల్‌చల్ సృష్టించాడు. దీంతో ఎస్ఐ పి.రామారావు ఆయన కుటుంబీకులను పిలిపించి అప్పగించారు.

ధరలు తగ్గించాలి

కొణిజర్ల: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తుందని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు మేరుగు రమణ విమర్శించారు. మంగళవారం చిన్న గోపతిలో గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చిన్న గోపతి ఖాళీ సిలిండర్‌లు, కట్టెల పొయ్యిలతో నిరశన ప్రదర్శన చేశారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సమాఖ్య సమావేశం బొలమాల సరోజిని అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమారి, కాంతమ్మ, అనిత, సరోజిని, మరియమ్మ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచార యత్నం

చింతకాని: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై సమీప బంధువైన బద్దల ఉపేందర్ సోమవారం సాయంత్రం అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ సమయంలో ఆమె కేకలు వేయగా భర్త రావడంతో అయనను కర్రతో కొట్టి గాయపర్చడంతో పాటు తనకు లొంగిపోకపోతే వివాహితను చంపుతానని బెదిరించాడు. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉపేందర్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

నేత్రదానం

పెనుబల్లి: కొత్తకారాయిగూడెం గ్రామానికి చెందిన ముచెర్ల బతుకమ్మ (75) మంగళవారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. ఖమ్మం నేత్ర నిధికి చెందిన టెక్నీషియన్ మందా నాగేశ్వరరావు బతుకమ్మ నేత్రాల నుంచి కార్నియాలు సేకరించి, ఖమ్మం నేత్ర నిధికి తరలించారు. ఈ కార్యక్రమంలో అభయ లయన్స్‌క్లబ్ సభ్యులు చలమాల నరసింహారావు, రామారావు, యలమంచి సాంబశివరావు తదితరులు ఉన్నారు.

సత్తుపల్లి ఆత్మకమిటీ చైర్మన్‌గా వాసు


వనమా వాసు

సత్తుపల్లి: సత్తుపల్లి ఆత్మ కమిటీ చైర్మన్‌గా వ్యాపారి వనమా వాసుదేవరావు(వాసు)ను నియమించినట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన వనమా వాసును సత్కరించారు. అనంతరం పలువురు వాసుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సాయం

కల్లూరు: బీజేపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉటుందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఈవూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని చిన్నకోరుకొండిలో ఇటీవల మృతి చెందిన బీజేపీ బూత్ లెవల్ అధ్యక్షుడు హుస్సేన్ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాడుగుల చిన్నికృష్ణ, కామిశెట్టి రంగారావు, వడ్లమూడి శ్రీనివాసరావు, గుమ్మా గంగరాజు, మాడుగుల వెంకటేశ్వర్లు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ ఆదినారాయణ, ఉయ్యాల యాదగిరి, వసంతరావు, నాగరాజు మంగళవారం ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ఎక్కి నిరసన తెలిపారు. గ్రామ చివరన ఉన్న ప్రభుత్వ భూమిలో గత కొంతకాలంగా గుడిసెలు వేసుకుని నివసించామన్నారు. వృత్తిరీత్యా ఇక్కడ నుంచి వేరే ప్రాంతానికి తాత్కాలికంగా వెళ్లామని తెలిపారు. ఇంతలోనే స్థలాన్ని ప్రభుత్వం ఓ వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయటంతో తాము నష్టపోతున్నామన్నారు. అధికారుల వచ్చి సమాధానం చెప్పే వరకు తాము దిగమనడంతో పోలీసులు, గ్రామ పంచాయతీ సిబ్బంది చేరుకుని నచ్చచెప్పారు. అధికారులతో మాట్లాడతామని వారు సర్దిచెప్పడంతో ట్యాంక్ దిగి నిరసన విరమించారు.

ఘనంగా హోలీ వేడుకలు

హోలీ వేడుకలను అన్ని మండలాల్లోని ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. యువకులు, పిల్లలు, మహిళలు గ్రామాల్లోని పురవీధుల్లో తిరుగుతూ కేరింతలు కొడుతూ రంగులు చల్లుకున్నారు. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లి టౌన్: హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య


వైరా: హోలీ వేడుకలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్


ఎర్రుపాలెం: కండ్రికలో ఎస్సై సురేష్‌తో కలిసి హోలీ ఆడుతున్న మహిళలు


ఏన్కూరు: హోలీ వేడుకల్లో చిన్నారులు


ముదిగొండ: రంగులు చల్లుకుంటున్న మహిళలు


కారేపల్లిలో..


కల్లూరు రూరల్: హోలీ ఆడుతున్న గిరిజనులు


పెనుబల్లిలో.. చిన్నారుల కోలాహలం


కొణిజర్లలో..


వైరారూరల్: విప్పలమడకలో..


చింతకాని: మత్కేపల్లిలో..


మధిర స్విమ్మర్స్ హోలీ సంబురాలు

రైతుల సాగునీటి కష్టాలు


కొణిజర్లలో వైరా మేజర్ వద్ద నీటి కోసం అడ్డుకట్ట వేస్తున్న రైతులు

కొణిజర్ల: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు కింద సాగు చేస్తున్న రైతుల సాగునీటి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వారబందీ విధానంతో నీటిని విడుదల చేస్తుండటంతో కాల్వ ఆయకట్టు కింద ఉన్న రైతులు పంటలకు నీటి తడులు వేసుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. వైరా మేజర్, దిద్దుపూడి మేజర్, సింగరాయపాలెం మేజర్ కింద పంటలు సాగు చేస్తున్న రైతులు చివరి ఆయకట్టు కింద పంటలకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం నుంచి బోనకల్ బ్రాంచ్ కాల్వ కింద ఉన్న అన్ని మేజర్లకు నీటి సరఫరా నిలిపి వేయడంతో రైతులు పంటలకు సాగు నీటి కోసం కాల్వలో అడ్డుకట్టలు వేసి నీటిని మలుపుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. దీంతో రైతుల పండించిన మొక్కజొన్న, పెసర, మినుములు నీరు లేక ఎండిపోయే పరిస్థితి దాపురించింది. కాలువకు నీరు విడుదల చేసినప్పుడల్లా పైనరైతులు రెండు సార్లు తడులు పెట్టుకుంటున్నారు. చివరి ఆయకట్టు రైతులకు నీరు చేరకమునుపే వారబందీతో నీటిని నిలిపివేస్తున్నారు. ఇలానే కొనసాగితే రైతులు నీటికోసం కొట్లాటకు దిగే పరిస్థితి రావొచ్చునని ఆందోళన చెందుతున్నారు. ఒకసారి ఉన్నతాధికారులు రైతుల మొరను పంట్టించుకొని చివరి ఆయకట్టు రైతులకు నీరు చేరే వరకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీజేపీ పాలనలో ఆర్థిక రంగం కుదేలు


కల్లూరురూరల్: మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వెంకట్

కల్లూరు రూరల్/వైరారూరల్: బీజేపీ పాలనలో ఆర్థిక రంగం కుదేలైందని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీపీఎం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తెలిపారు. కల్లూరులో నిర్వహించిన ఖమ్మం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సభలో, వైరా మండలంలోని విప్పలమడకలో సోమవారం రాత్రి రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని తెలిపారు. మోదీ దుర్మార్గపు పాలన వల్ల దేశ భవిష్‌త్‌లో అనేక ఇబ్బందులు పడుతుందన్నారు. ప్రజా స్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడమేకాకుండా న్యాయ వ్యవస్థను కూడా స్వాతంత్రంగా పనిచేయ కుండా బీజేపీ అడ్డుపడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో నిరసన చేపడుతున్నామని తెలిపారు. ఈ నెల 22న వైరాకు చేరే యాత్రకు ప్రజలు ఘన స్వాగతం పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్రి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరావు, తన్నీరు కృష్ణార్జునరావు, కృష్ణవేణి, అంజయ్య, నర్సింహారావు, పుల్లయ్య, సర్పంచ్ జాన్‌పాపయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణారావు, నాగేశ్వరరావు, సిరాబంధి, శ్రీనివాసరావు, కృష్ణమాచారి,రుద్రాక్షల నరసింహాచారి, పుల్లారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


వైరా: మాజీ ఎమ్మెల్యే చంద్రావతిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్, మహిళా సంఘం సభ్యులు

వైరా: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వైరాలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చంద్రావతిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా రాజకీయంగా సేవారంగంలో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌డిస్ట్రిక్ట్ గవర్నర్–2 నంబూరి మధు, డాక్టర్ కాపా మురళీ కృష్ణ, సీహెచ్ నాగేశ్వరరావు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు..

సత్తుపల్లి టౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆశ కార్యకర్తలు, మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ సుజాత, మెప్మా, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ప్రసాద్, నరేష, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా జలబిందెల మహోత్సవం


జలబిందెలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ముదిగొండ: మండలంలోని కమలాపురంలో శ్రీఅంకమ్మ, మద్దిరావమ్మ, శ్రీమహాలక్ష్మి, నాగేంద్రస్వామి, పెద్దమ్మ తల్లుల జాతర మహోత్సవంలో అమ్మవార్ల జలబిందెల మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచన, అమ్మవారి విగ్రహాల నదీయాత్ర, జలబిందెల గ్రామోత్సవం, మునేటిలో జలాదివాసం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కమలాపురం, అయ్యగారిపల్లి గ్రామాల్లోని వీధులలో మహిళలు, అమ్మవార్ల భక్తులు జలబిందెలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవార్ల విగ్రహాలకు నీళ్లుపోశారు. అనంతరం అమ్మవార్ల ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

ఎంపీ వితరణ


కంప్యూటర్లు అందజేస్తున్న ఎంపీ పార్థసారథిరెడ్డి

సత్తుపల్లి: పట్టణంలోని పాత సెంటర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధి రెడ్డి కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు అందజేశారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాఠశాలకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యతో కలిసి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, వైస్ చైర్‌పర్సన్ సుజలారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే రఫీ, మట్టా ప్రసాద్, మోరంపూడి ప్రభాకర్, మౌలాలి, రవీందర్‌రెడ్డి, చల్లగుండ్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌లో కీలక పదవులు

వైరా: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్‌లో 2023–24 సంవత్సరానికి గాను వైరా లయన్స్‌క్లబ్‌కు 4 కీలక పదవులు లభించాయి. డిస్ట్రిక్ట్ జీఎంటీ కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, డిస్ట్రిక్ట్ మహిళా కమిటీ కో ఆర్డినేటర్‌గా కొమ్మినేని భారతి, రీజనల్ చైర్ పర్సన్‌గా లగడపాటి ప్రభాకర్‌రావు, జోన్ చైర్మన్‌గా డాక్టర్ శ్రీధర్‌గౌడ్‌లను నియమిస్తూ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్ ప్రకటించారు. ఈ సందర్భంగా పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ మాట్లాడుతూ... వైరా లయన్స్‌క్లబ్ అందజేస్తున్న సేవలకు గాను వీడీజీ-2 గా నంబూరి మధు ఎంపిక కావడంపై అభినందనలు తెలిపారు. వైరా లయన్స్‌క్లబ్‌కు పదవులు లభించడం పట్ల క్లబ్ పెద్దలు తీగల మోహనరావు, వైరా క్లబ్ అధ్యక్షుడు చింతోజు నాగేశ్వరరావు, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కొణతాలపల్లి సుబ్బారావు, చింతనిప్పు వెంకటయ్య, గజ్జెల కృష్ణమూర్తి, రాయపూడి వెంకటేష్, మిట్టపల్లి నాగి, తదితరులు అభినందించారు.

'నాలుగో తరగతి' జిల్లా ఉపాధ్యక్షుడిగా రామారావు



పెనుబల్లి: నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగాపెనుబల్లి తహసీల్‌లో పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినేట్ వై. రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

భట్టి పరామర్శ

ముదిగొండ: ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడిన మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు సతీమణి శ్రీదేవిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బాబు, నరసింహారావు, హుస్సేన్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా కల్వర్టు



మధిర నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో నిదానపురం క్రాస్ రోడ్డు సమీపంలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టుకు ఒకవైపు సైడ్‌వాల్ లేదు. మరోవైపు సంగం ధ్వంసమై కొంత మాత్రమే మిగిలింది. ప్రతిరోజు ఈ దారిలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆదమరచి వాహనం నడిపితే ఇక అంతే సంగతులు. ఈ సమస్యపై ప్రజలు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. – మధిర

ప్రశ్నించాల్సిన అధికారి : రాజేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ, మధిర
సెల్ నంబర్ : 9912340678

కల్యాణం.. కమనీయం

వైభవంగా శ్రీ చెన్నకేశవస్వామి కల్యాణం


చింతకానిలో చెన్నకేశవస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు


చింతకాని: మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయ ఆవరణలో మంగళవారం శ్రీ భూ, నీలా సమేత చెన్నకేశవస్వామి కల్యాణాన్ని వేదపండితులు ప్రతాపురం పవన్‌కుమారాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణంలో భాగంగా సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, చతుస్థాన అర్చనలు, స్వస్తి పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, నిత్యహోమం, బలిహరణం, పూర్ణాహుతి, స్వామివారి ఎదురుకోళ్ల ఉత్సవం అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందినిలతో పాటు పలువురు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ సుభద్ర, ఉపసర్పంచ్ వేణుగోపాల్‌రావు, ఎంపీటీసీ రాంబాబు, ఆలయ కార్యనిర్వాహణాధికారి రామకోటేశ్వరరావు, ఆలయ అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ నాగరాజు, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో ఘనంగా శ్రీవారి కల్యాణం


శ్రీలక్ష్మి, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం (సంతగుడి)లో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రముఖ ప్రవచకులు రవికిరణాచార్యులు భక్తి ప్రసంగం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు దంపతులు పీఠలపై కూర్చొని వివాహ తంతు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానానికి తెల్దారుపల్లికి చెందిన పెండ్యాల జగదీష్ – కుసుమ దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఈఓ నల్లమోతు శేషయ్య, పగడాల మోహన్‌కృష్ణ, గ్రామ పెద్దలు నరసింహారావు గుప్తా, సురేందర్ మనియార్, నాయకులు పగడాల మంజుల, పెద్దబోయిన ఉమాశంకర్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి తిరుకల్యాణోత్సవం..


కల్లూరులో స్వామివారి తిరుకల్యాణోత్సవం జరుగుతున్న దృశ్యం

కల్లూరు: కల్లూరులోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాలస్వామి వారి తిరుకల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి రామాచార్యులు, మధుసూదనశర్మల వేద మంత్రాల సాక్షిగా స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయంలో చతుస్థానార్చన, హోమం, నివేదన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కృష్ణ, కాకతీయ షుగర్స్ ఫ్యాక్టరీ సివిల్ ఇంజనీర్ కొడాలి రఘునాథబాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణుడి కల్యాణానికి పట్టు వస్త్రాలు


పూజలు నిర్వహిస్తున్న మల్లు నందిని విక్రమార్క

మధిర: పట్టణంలోని చెరుకుమల్లి వారి వీధిలో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని విక్రమార్క పట్టు వస్త్రాలు సమర్పించి గీతా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కర్లపూడి వాసు ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

కృష్ణుడి కల్యాణం..


తల్లాడలో సంతాన వేణుగోపాలస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

తల్లాడ: మండల కేంద్రంలోని రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో అభిషేక పూజలు, స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కృష్ణ మందిరాన్ని సందర్శించిన డీసీసీబీ చైర్మన్..

మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో కృష్ణ మందిరాన్ని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబుయాదవ్ అన్నారుగూడెం, నారాయణపురంలోని కృష్ణ మందిరంలో పూజలు నిర్వహించారు. అన్నారుగూడెం సర్పంచ్ మమత, రామకృష్ణ, లింగయ్య, మింగి రాజు, వెంకన్న, పంపాద్రి, బుజ్జి పాల్గొన్నారు.

రుక్మిణీ శ్రీకృష్ణుల కల్యాణం..

సత్తుపల్లి టౌన్: జవహర్ నగర్ శ్రీకృష్ణమందిరంలో మంగళవారం శ్రీ రుక్మిణీ, శ్రీ కృష్ణుల కల్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, శ్రీను, వాసు, లక్ష్మయ్య, రమేష్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.